
# కప్పలు

వై. రాంబాబు & శాయి



చీకటిని మింగి వెలుగు వేడిగా మారుతోంది. కొత్తగా వేసిన రోడ్డు మీద నుంచి చెలరేగిన గాలి విర్రబడుతోంది. సూర్యకిరణం చురుకెక్కే కొద్దీ చెమటలు ధారాపాత మౌతున్నాయి. చుక్క రాలదు; ఉక్క మానదు. అందరి దృష్టీ ఆకాశం పైనే.

రైతు గుండెలా చేలు బీటలు వారాయి. చూ పానినంత మేర పచ్చదనం లేదు. బావులు ఎండిపోతున్నాయి. మరో పది రోజులు ఇలాగే సాగితే -తాగడానికి గుక్కెడు నీళ్లు కూడా దొరకని దురవస్థ తప్పదని జనం బెంబే లెత్తుతున్నారు.

పెద్ద వీథిలో హడావిడిగా ఉంది. కదిలే బొమ్మల్లా జనం కదను తొక్కుతున్నారు. వీరణం మోత గుబ లదరగొడుతోంది. తాసా నిరంతరాయంగా పలుకుతోంది. డప్పు చప్పుళ్ల కనుగుణంగా లయబద్ధంగా యువకులు కొందరు కాళ్లు కదుపుతున్నారు.

క్రమంగా పెరుగుతున్న సమూహం ప్రతి యింటి ముందూ ఆగుతూ సాగుతోంది. పసుపు కలిపిన నీళ్ల

బిందెలతో తెచ్చి పోస్తున్నారు. ఎర్ర పంచె కట్టుకున్న వాడి నెత్తిన కుండ ఆకాశం వంక చూస్తోంది.

ఇంటింటికీ ఊరేగింపు సాగుతోంది. ఉత్సాహం వెల్లువలై పారుతోంది. రణగొణ ధ్వనులతో వీథులు తడుస్తున్నాయి. కూడా ఉన్న కోటయ్య డబ్బులు పిండి పిండి వసూలు చేస్తున్నాడు. కోరమీసాల నుంచి దొంగ చిరునవ్వులు మెరుస్తున్నాయి. అప్పుడప్పుడు బూతులు కురుస్తున్నాయి. ఉండుండి, అదిరిపడే కేకలతో జనాన్ని అదిలిస్తున్నాడు.

"మీ అసుంటో ళ్లుండమట్టే సుక్క రాలడం

కప్ప, పసుపు నీళ్లు మీద పడ్డప్పుడల్లా కళ్లు మిటకరించి, బెకబెక మంటోంది. ఊరికి దూరంగా మురికి గుంటలో తన కొచ్చిన బెకబెకల పాటలు పాడుకుంటూ యిన్నాళ్లూ స్వేచ్ఛగా హాయిగా గడిపిన తననిలా కుండలో బంధించిన దెందుకో తెలీక ఉక్కిరిబిక్కి రౌతోంది.

యానాది గూడెం మధ్యలో ఎంతో వయసున్న మఱ్ఱి చెట్టు మరీ ముసలి దానిలా కనబడుతోంది. వడగాడ్పుల కది ఈ మధ్య బాగా వడలి పోయింది. ఊడలు ఆసరాగా కనబడుతున్నా, నేల అందక నిస్సహాయంగా వేలాడుతున్నాయి.

పన్నెండేళ్ల మరిణి చెట్టు కింద గోళీ లాడుకుంటూంటే-డప్పుల చప్పుడు వినిపించింది. అధాటున లేచి నిలబడితే వాడి గోచీ ఊడిపోయింది.

మెరిశాయి. మరిణి కంటె పెద్ద వాడైన కాటమ యిట్టే పోల్చుకున్నాడు.

జారిపోతున్న చెడ్డీని పైకి లాక్కుని, కుడి భుజానికి ముక్కు తుడుచుకున్నాడు. ఎడం చేత్తో గుబురు జుత్తులో వేళ్లు జొనిపి బుఱ్ఱ గోక్కున్నాడు.

"ఒరేయ్ మరిణీ! కప్ప దేవుడి ఊరేగింపు-" అని పెద్దగా అరిచాడు. ఎక్కడి దక్కడ వొదిలేసి, చెడ్డీని మళ్లీ పైకి లాక్కుని, పరుగు లంకించుకున్నాడు.

ఒక్క క్షణం మరిణికేం తోచలేదు.


"ఆగెహే!-నేనూ వత్తన్నాను-" అని వెంట పడ్డాడు. ఆయాస పడుతూనే అడిగేడు-ఊరేగిం పెందుకని.

"వొరసం కోసం-" కాటమ వెనక్కు చూడకుండానే చెప్పాడు.

ఊరేగిం పింకా పొలిమేరలు చూడ లేదు. సాయంత్రం నుంచి కారు మేఘాలు కమ్ముకుం టున్నాయి. ఆవుమేఘాల మీద గాలి

తరుముకొచ్చింది. వడగళ్లూ-దభేటు వాన- ఎంతకూ వదలని ముసురు- 'ఛీ ఛీ వెధవ్వాన!-ఇంక చాలు బాబో!' అనేంతగా కురిసి భూము లన్నీ తడిసి-ఇళ్ల చాలనంత పండి-చేతి నిండా గలగలా మెరిసే శుభఘడియలు వచ్చాయని ఊరి జనం ఉత్సాహ పడింది.

"సూసేవా తిరపతయ్యా బావా!



లేదు. ఇసరండెహే - మాపిటికి ఏకధారగా కురిసేత్తాది-"

జేబులు బరువెక్కే కొద్దీ అతని మాటల ప్రవాహం జోరౌతోంది. సూదంటు రాయి సూదుల నన్నింటినీ ఒంటి మీద చేర్చుకున్నట్టు-డప్పు మోతకు ఊరు ఊరంతా ఊరేగింపులో చేరింది. డప్పుల అప్పలస్వామి కఱ్ఱ కదలికలకు వాళ్ల కాళ్లు అనుసరిస్తున్నాయి. పిల్లల కేరింతలు కీచు ధ్వనులై చిందు లేస్తున్నాయి.

కుండ నెత్తుకున్న వాడు నాని నాని చురు కెక్కుతున్నాడు. దర్జాగా లోపల కూర్చున్న బోదురు

"ఏంట్రా-ఆ గోల?" అనడిగేడు, సర్దుకుంటూ.

దూరంగా కాలవ ఒడ్డున వాన పాముల కోసం వెదుకులాడుతూ నేలను పెళ్లగిస్తున్న కాటమరాజు తలెత్తి చూశాడు. పెద్ద వీథి నుంచి ఊరేగింపు చిన్న వీథికి తిరుగుతోంది. వాడి కళ్లు ఆనందంతో

కప్పని ఊరేగిత్తే ఏటవుద్దని ఇకఇక లాడేరు- ఇప్పుడు సూసేవా మరి-" ఎనభై ఏళ్ల పడుచు కుఱ్ఱాడు పెద్ద రాజు బోసి నవ్వులు కురిపించేడు.

ఒక జల్లు రాలి మట్టి వాసన గాలి లోకి లేచింది. చెట్ల ఆకుల మీద చల్లదనం బిందువులుగా చక్కిలిగిలి పెట్టింది. మేఘానికీ, మేదినికీ మధ్య సన్నటి పొగవ ౦ంచు సరదాగా అలముకుంది. ఒక్క క్షణం-అంతే-ఆశల మేఘాలను దురదృష్టం గాలి ఎగరేసుకు పోయింది. మనిషిని సైతం పైకి లేపి పల్టీ కొట్టించి నింగి దాకా దొంగిలించుకు పోయేంత వేగంగా మాయదారి గాలి-నూకాలమ్మ గుడి దగ్గర ఎవ్వరూ ఎరగని కాలం నించి గబ్బిలాయిలకు పుట్టినిల్లుగా ఉన్న పెద్ద రావి చెట్టు కూకటి వేళ్లతో కూలి పడి పోయింది.

"ఎక్కడో సముద్రంలో కురిసేత్తం దిది-" అని గొణుక్కున్నాడు పెద్ద రాజు-కుంకుడు గింజంత నల్ల మందు మాత్ర గుటుక్కున మింగుతూ.

తెల్లవారింది. ఆకాశం వెల్లబారింది. వేకువలా లేదు-వేడి అలముకుంది. డప్పు మోగించిన చేతులు నొప్పితో గొణిగాయి. వీరణం, తాసా మోతలు మోళ్లయ్యాయి. చిందులేసిన కాళ్ల పూరిళ్ల అరుగుల మీద నిరుత్సాహంగా, నిశ్చేతనంగా కూలబడ్డాయి.

కోటయ్య కోసం ఎవరో జీప్‌లో వచ్చారు. తల కెక్కిన మత్తింకా తలగడ దిగలేదు. కేకలు చెవిలో సీసంగా కరిగితే ఉలిక్కిపడి లేచాడు. వాళ్లు మోసుకొచ్చిన వార్త సంబరం వెలిగించింది.

యానాది గూడెంలో సందడి మొద లైంది. గునపం, బాణా కఱ్ఱ, బుట్టలు వేటకు బయలు దేరాయి. ఎక్కడి నుంచో ఆర్డ రొచ్చిందట-కప్పకి రూపాయి-చిన్నదైనా, పెద్దదైనా ఒకటే రేటు. అర్జంటు ఆర్డరు గనుక నెల రోజులు తిరక్కుండా కోరుకున్న పరిమితిలో కప్పల్ని ఎగుమతి చేసెయ్యాలి.

మాగాణి భూముల్లో మసలే సకల ప్రాణి కోటినీ వేటాడే నైపుణ్యం వాళ్లకు వారసత్వపు హక్కు. తేనె పట్లు వెదికి, పచ్చి తేనె పిండి అమ్ముకోడం వాళ్లకు అలవాటు. ఎంత గొప్ప తాచునైనా అవలీలగా పట్ట గలరు-గరళం ఖరీదైంది. ఎగిరే పిట్టల్ని ఎంతో సులభంగా సజీవంగా బంధించగలరు. ఎలకలు, చిలకలు-పీతలూ, దొందులూ-వాళ్ల చేతికి చిక్కే ప్రాణి కోటిని రూపాయలుగా మార్చుకుని తాగుడుకూ, తిండికీ విచ్చలవిడిగా ఖర్చు చేయడం అలవాటైన వాళ్లకు కప్పల్ని చంపడంమేం కష్టం ? వాటి కాళ్లు ఊడలాగడ మెంత? వేట వేగం పుంజుకుంది.

గ్రామంలో కొందరు తెలివైన యువకులు సంయుక్తంగా కప్పల యెగుమతి ఏజెన్సీ ప్రారంభించారు. చిన్న వీధిలో పార్టీ ఆఫీసు బోర్డు రాత్రికి రాత్రి భజగోవిందా కప్పల ఎగుమతి ఏజెన్సీ అక్షరాలతో జిగజిగ లాడింది. బేనర్లూ, తోరణాలూ-బేండు మేళమూ, పెద్ద మీటింగూ!!

"సోదరసోదరీమణులారా! నా ప్రియమైన ఓటరులారా!" అంటూ ప్రారంభించారు మాజీ ఎమ్మెల్యే నిర్మితి నిరంకుశరావు.

"స్వయంఉపాధికి మార్గాలు వెదుక్కోడం బుద్ధిమం తుల లక్షణం ఎగుమతులు నెరగాలి. పచ్చగడ్డిని కూడా పరదేశాల కమ్ముకో వచ్చు. తెలివి ఎవరి సొత్తూ కాదు. నా కెందుకు లెమ్మని అనుకుని సోమరిగా కాలక్షేపం చేస్తే వృథాగా పైసా ఎవరూ రాల్చరు. అవకాశం వచ్చింది. మనకు పనికి రానిది వాళ్లు మహాయిష్టంగా తింటున్నారు. అమ్ముకునే అవకాశం కాలదన్నుకో కూడదు. రూపాయి పెట్టుబడికి పన్నెండింతల లాభం. మారుతున్న ఆర్థిక వ్యవస్థలో మనం మరింతగా ఎదగాలి. ఇక్కడ ఏ ఉత్పత్తీ లేదు. ఉద్యోగాల్లేవు. ఉదాసీనత వద్దు. మనం అవకాశాలు వెదుక్కుందాం-"


ఎక్కడో ప్రారంభించి ఆయన అనర్గళంగా చేసిన ఉపన్యాసానికి అందరూ ఈలలు మిళాయించి చప్పట్లు కొట్టారు.

"నేను మీ మనిషి నన్న అభిమానంతో ఈ ప్రారంభోత్సవానికి నన్ను పిలిచారు. గత ఎన్నికల సమయానికి నా తప్పు లేక పోయినా, మీరే నన్నోడించారు. ఈ విధంగా మీ అభిమానం పొందిన నన్ను ఈసారి తప్పక గెలిపించండి. గుండు గుర్తుకే మీ ఓటు-" అంటూ పనిలో పనిగా అభ్యర్థించేసి, ఆయాసంతో నిట్టూర్చారు.

ఆ ఊళ్లోనే కాదు, చుట్టుపట్ల గ్రామాల్లోనూ ఎగుమతి ఏజెన్సీలు పుట్టుకు వచ్చాయి. కప్పల వేట నిరంతరాయంగా సాగుతోంది. కప్పల ఎగుమతిదారుల మండల సమాఖ్యకు అధ్యక్షునిగా ఎన్నికైన కోటయ్యను అభినందించడానికి ఏర్పాటైన సభకు అధికార పక్షానికి చెందిన ఎమ్మెల్యే గోండ్రు సోమారావు అధ్యక్షత వహించారు.

"కప్ప ఎందుకూ పనికి రానిదైనా ఇవాళ ఎందరికో బ్రతుకు తెరువు చూపించింది. కప్పలను చంపడం పాపమని కొందరు చాదస్తులు సణుగుతున్నారు. పాపమని పామును చంపకుండా వొదులుత్తున్నామా? తేలు కనిపిస్తే ఏం చేస్తున్నామయ్యా- పనికి రాని మాటలతో మనకు పని లేదు. మీరంతా చేస్తున్న ఈ మంచి పని వల్ల మన ప్రాంతం ఆర్థికంగా బలపడుతున్నదని నాకెంతో గర్వంగా ఉంది. కొందరు అవకాశవాదులు అలవాటు కొద్దీ ఏ మీటింగులోనైనా ఓట్లడుగుతారు. ఎవరు నిజమైన ప్రజా సేవకులో గుర్తించే నేర్పు గల మీ రంతా నా వాళ్లని- మీ అండదండలు నా కెప్పుడూ ఉంటాయని నా నమ్మకం. నన్ను మాత్రం మీరెప్పుడూ మరచి పోకండి. మీ ఓటు నాకే!"

మనిషి చచ్చినా, పుట్టినా, ఎన్నికైనా, అవార్డు వచ్చినా అభినందించడానికి ముందుకు వచ్చే వాళ్లలో పత్రికల ప్రకటనల విభాగంలో పని చేసే వాళ్లు ముం దుంటారు. వాళ్ల బాధ పడలేక కోటయ్య అభిమానులు తలో వందా చందా యిస్తే- పత్రికలన్నీ అభినందన మందారాలు ప్రకటించాయి. బోదురు కప్పను ఊరేగించిన



## సాహస బాలలు - 7



## దొంగను ధిక్కరించిన ఇతిశ్రీ మిశ్రా

ఒరిస్సా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో గత సంవత్సరం ఫిబ్రవరి 7 రాత్రి 8.30 గంటల సమయంలో కుమారి ఇతిశ్రీ మిశ్రా అనే పద్నాలుగేళ్ల అమ్మాయి పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతూండడంతో తన గదిలో కూర్చుని పాఠాలు శ్రద్ధగా చదువుకుంటోంది. ఆ సమయంలో ఇంట్లో తనొక్కతే ఉంది. అంతలో వారి ఇంటి బాల్కనీలో ఉన్న తలుపును ఎవరో టకటకా తట్టారు. ఎవరా అని తలుపు తీసి చూస్తే ఎదురుగా ఒక ఆగంతకుడు చాకు ఝుళిపిస్తూ కనిపించాడు.

తలుపు తెరవడంతోనే వాడు ఆ అమ్మాయి చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు. అయితే తన చేతిని బలవంతంగా వెనక్కు లాక్కుని తలుపు మూసివేయబోయింది ఇతిశ్రీ. అయితే ఆ దుండగీడు ఆమెను తీవ్రంగా ప్రతిఘటించి తన చాకుతో ఆమె ఎడమ చేతిపైన, మెడపైన పొడిచి గాయాలు చేశాడు. అయినప్పటికీ ధైర్యాన్ని వీడకుండా తీవ్రంగా ఆ దుర్మార్గుడితో పెనుగులాడి, విదిలించుకుని, తలుపును మూసి లోపల గడియపెట్టింది. లోపల ఉన్న టెలిఫోన్‌లో పొరుగున ఉన్న వారికి విషయం చెప్పింది. వెంటనే వారంతా ఇతిశ్రీ ఇంటి దగ్గరకు పరుగెత్తారు. అప్పటికే ఆ అలికిడి విన్న దొంగ కాస్తా పలాయనం చిత్తగించాడు. అంతలో ఆమె కుటుంబీకులు కూడా వచ్చి జరిగిన ఉదంతాన్ని పోలీసులకు తెలియజేశారు.

కుమారి ఇతిశ్రీ అసమాన ధైర్యంతో, సమయస్ఫూర్తితో తన ఇంటిని దోపిడీదారుని బారినుండి రక్షించింది.

Ⓟ అనిపెద్ది వెంకట రమణరావు

---

ఫలితం ఆ విధంగా తనకు దక్కిందని కోటయ్య మిత్రుల ముందు వెల్లడించిన సంగతిని కూడా పత్రికలు బాక్సులు కట్టి వార్తలు ప్రచురించాయి.

"పెద్ద రాజు బావా! ఇంక వొరసం కురిసీ గీత లేదంటావా?" అనడిగాడు ఒక రోజు సాయంకాలం, చుట్ట చుట్టుకుంటూ, తిరపతయ్య.

"ఇంక వరసవేఁదయ్యా!- కురిసీ కార్తెలన్నీ ఎల్లిపోయాయి-" అన్నాడు పెద్దరాజు. అని ఊరుకో లేదు. "ఈల్లంతా కప్పల్ని సంపి ఎక్క డెక్కడికో పంపించేత్తన్నారు. కప్పల్లేకపోతే వొరసా లుండవ్! మనం ఏదో దారి సూడాలి. ఈ సంపడాలు ఆపాలి!"

సంప్రదాయవాదు లంతా సమావేశ మయ్యారు. కప్పలను చంపే కార్యక్రమాన్ని నిరోధించడానికి ఒక బృహత్ప్రణాళిక రూపొందించారు.

అవాళ కప్పల ఎగుమతులకు నిరసనగా పెద్ద ఊరేగింపు జరిగింది.

"కప్పలను చంపడం పాపం, అది మానవజాతికి శాపం" అంటూ రకరకాల నినాదాలు రాసిన బోర్డులు పట్టుకుని విద్యార్థులు వీధిన పడ్డారు.

నినాదం దొరికితే చాలు పాఠాలకు స్వస్తి. బడులు మూత పడ్డాయి. ఉద్యమం ఊపందుకుంది. కప్పల ఎగుమతుల నిరోధకసమితి ఏర్పాటైంది. మండల స్థాయిలో కమిటీ- అనుబంధంగా గ్రామ స్థాయి కమిటీలు-ఊరూరా ఊరేగింపులూ-అధికారులకు వినతి పత్రాలు-

కప్పలను చంపడం వల్ల వాతావరణంలో మార్పు సంభవించి వానలు కురవడదం లేదనీ, ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కోడానికి ప్రభుత్వం వెంటనే పూనుకోవాలని వినతి పత్రాల్లో విజ్ఞప్తులు- సంతకాలు-వేలి ముద్రలు. రాష్ట్రపతికి, ప్రధానమంత్రికి టెలిగ్రాములు వెళ్లాయి. నిరాహార దీక్షలు-అడుగడుక్కో గుడారం.

ఆకాశం వంక చూస్తున్న వాళ్లు వేదాంతధోరణికి వెళ్లిపోయారు. దేవుళ్లకు స్తోత్ర పాఠాలు చదవడానికి గంటలు సరిపోవడం లేదు. జిల్లాలో కరవు పరిస్థితిని పరిశీలించడానికి వచ్చిన అధికారబృందం ఆ ప్రాంతంలో ప్రబలిన దైవభక్తి గురించి ప్రత్యేకించి పేర్కొన్నారు. నిరీశ్వరవాదులు కూడా పొద్దుటే స్నానాలు చేసి, పెద్ద పెద్ద బొట్లూ, విభూతి పెండేలూ పెట్టుకుంటున్నారు. ప్రతి గుడీ బిజీ బిజీ. గుళ్ల దగ్గర కొబ్బరి కాయలు పెఠిల్లుమంటున్నాయి. కొబ్బరి కాయల ధర క్రమంగా పెరిగి పోతోంది. కొత్తగా అచ్చయి మార్కెట్లోకి వచ్చిన స్తోత్రమాలల పుస్తకాలకు గిరాకీ పెరిగింది. బ్లాకులో అమ్మకాలు జోరయ్యాయి. ఆడియో కేసట్లలో దేవుళ్ల పాటలు ప్రతిధ్వనిస్తున్నాయి. పాత భక్తి సినిమాల హైర్ రేట్లు పెంచేశారని థర్డ్‌పార్టీలు విసుక్కుంటున్నాయి. కొత్తగా కొన్ని కనక దుర్గ ఆలయాలు వెలశాయి. పనీ పాటా కోల్పోయిన వారి కోసం ఏలిన వారు సేవాభావంతో చీప్ లిక్కర్ షాపుల లైసెన్సుల జారీ చేపట్టారు.

కప్పల ఎగుమతుల నిరోధకసమితి కారకలాపాలు ముమ్మరం కావడదంతో ఎగుమతిదారుల గుండెల్లో కొత్త లైన్లు లేకుండానే రైళ్లు పరిగెత్తడం ప్రారంభించాయి. కప్పల ఎగుమతిదారుల మండల సమాఖ్యల సంయుక్త సమావేశంలో- కప్పల ఎగుమతుల పరిరక్షణ సమితి ఆవిర్భవించింది. పత్రికల వారెవ్వరినీ సమావేశానికి అనుమతించ లేదు. నాలుగు గోడల మధ్యా పకడ్బందీగా పథకాలు రూపొందించారు. పరిరక్షణ సమితి నేతల స్టేట్‌మెంట్లు, పరిరక్షణ సమితి కార్యకలాపాల గురించి పత్రికల్లో పెద్ద యెత్తున వార్తల ప్రచురణకు ఒక బృహత్పథకం రూపొందించి, అవసరమైన అన్ని చర్యలూ తీసుకున్నారు.

కప్పలను చంప రాదనే ఛాందసవాదులు పారిశ్రామిక ప్రగతికిని అడ్డుకోవాలని చూస్తున్నారనీ, కప్పల ఎగుమతుల ద్వారా నాలుగు రాళ్లు సంపాదించుకుంటున్న - ఆర్థికంగా వెనుకబడిన తరగతుల ప్రయోజనాలను కాలరాస్తున్నారనీ పత్రికలద్వారా పరిరక్షణ సమితి పెద్దలు ఆందోళన వ్యక్తం చేశారు. కప్పలను చంపడం ఆదివాసుల జన్మహక్కనీ, వారిని నిరోధించడం రాజ్యాంగ విరుద్ధమనీ కప్పల ఎగుమతిదారుల గుప్పిట్లోని నేతలు కొందరు ప్రకటనలు గుప్పించారు. ప్రకటనలు, స్టేట్‌మెంట్లతో, ఎగుమతులకు సంబంధించిన భారీ ప్రకటనలతో చాలా పత్రికలు ఎక్కువ పేజీలతో అనుబంధాలు వెలువరించాయి.

తమను ఛాందసవాదులుగా పేర్కొనడంలో అర్థం లేదనీ, వర్గాల పేరిట కలహాలు సృష్టించడానికి యిటువంటి ప్రయత్నం తగదనీ కప్పల ఎగుమతుల నిరోధక సమితి నిర్వాహకులు ఖండనలు విడుదల చేశారు. జీవహింస ఎంత పాపమో వివరిస్తూ ప్రాచీన గ్రంథాల నుంచి శ్లోకాలు ఉదహరిస్తూ కొందరు వ్యాసాలు

ప్రకటించారు. పాప్యులర్ సినిమా పాటల స్టైల్సులో అటూ-యిటూ పాటల పుస్తకాలు ప్రచురించారు. ఆ పుస్తకాలకు సంబంధించి ఫలానా తేదీ లోగా ఆర్డరు రాస్తే యాభై శాతం రాయితీ ప్రకటనలు కూడా పత్రికల్లో వచ్చాయి ఎగుమతిదారులు, వారిని నిరోధించాలని చూసే వారూ-అంతకు ముందెప్పుడూ రోజూ పేపర్ కొనక పోయినా కొత్తగా అలవాటు చేసుకున్నారు. దాంతో పాఠకులు పెరిగినట్లు తాజా సర్వే వెల్లడించింది. పేపర్‌లో తమ వార్తలు చదవడానికి వీలుగా కప్పలు పట్టుకునే వారు అక్షరాలు నేర్చుకోవాలనే తాపత్రయంలో పడిపోయారు. వారి కోసం రాత్రి బడులు తెరిచారు.

ఆర్థికంగా వెనుకబడిన తాము నాలుగు రాళ్లు సంపాదించుకుంటూంటే, సనాతనవాదులు చూడ లేక కళ్లు కుట్టుకుంటున్నా రన్న ఆరోపణలు-వాటికి ఖండనలు రోజు రోజుకూ శ్రుతి మించి రాగాన పడ్డాయి.

ఆ రోజింకా సరిగా తెల్లవార లేదు.

వర్షం కురవక వాతావరణంలో తేమ కరువు కావడం కారణంగా రాత్రి నిద్ర పట్టని కోళ్లు తెల్లవారు జామున నిద్ర కొరగడంతో 'కొక్కొరొకో' శబ్దాలు వినిపించ లేదు. కోడి కూతకు నిద్ర లేచే యిల్లాళ్లు- ఇంకా కోళ్లు కూయలేదని వాకిళ్లలో కళ్లాపి జల్లలేదు. ముగ్గులు వేయ లేదు. బీడువారిన పొలాలను చూడ లేక పొద్దుటే చేని గట్టుకు వెళ్లే రైతులు తమ అలవాటు మానుకుని గుర్రు పెడుతున్నారు.

ఆ సమయంలో-

ఎక్కడెక్కడి నుంచో జనం లారీల్లో, ట్రాక్టర్లలో ఆ ఊరికి చేరుకుంటున్నారు.

జై జై నినాదాలు చేస్తూ సాగుతున్నారు. 'డౌన్ డౌన్' అంటున్నారు. సంగ తేమిటో చూదామని కొందరు యిళ్ల ల్లోంచి తొంగి చూస్తున్నారు. బ్యానర్లు, జండాలు, నినాదాలు- అంతా హడావిడిగా ఉంది.

పెద్ద వీధిలో గలాటా ప్రారంభమైంది. తలుపులు బద్దలు కొడుతున్నారు. అందిన వాళ్లనల్లా చావబాదుతున్నారు. ఆడవాళ్లని కూడా చూడడం లేదు. నిర్దాక్షిణ్యంగా మోదుతున్నారు. నిర్లజ్జగా బట్టలు ఊడదీస్తున్నారు. నిస్సంకోచంగా పిల్లలను ఎత్తి దూరంగా విసిరేస్తున్నారు. గొడవకు ఉలిక్కిపడి లేచిన కొందరు సత్తువ కొద్దీ పరుగెత్తుతున్నారు. పొలాల్లోకి పారిపో తున్నారు. కర్రలు, కత్తులు, కటార్లు ఆయుధా లయ్యాయి.

రక్తం కాలవలై పారుతోంది.

హాహాకారాలు మిన్ను ముట్టాయి.

చేతి కందిన వారిని చీల్చి చెండాడుతున్నారు. నిలిచి పోరాడే వారు లేరు. పారిపొయ్యే అవకాశం లేక ఏడుస్తూ, పెడబొబ్బలు పెడుతూ-బూతులు తింటూ-

ఈ లోగా ఒకింటికి నిప్పంటించారు.

బడ్డీ ఒకటి కూల దోశారు.

అంతా గందరగోళం.

నిప్పుకు అంది పుచ్చుకోవడం తెలుసు. ఉరుకులూ, పరుగులూగా ఊరంతా చుట్టేసింది. చిన్న వీధిలో పూరిళ్లు చురచుర లాడేయి.

నిరాటంకంగా మారణకాండ సాగుతోంది. పూరి గుడిసెలను స్వాహా చేసిన నిప్పు పొగల్లో దారుణాన్ని దాచి పెడుతోంది.

శత్రుమూకలను చీల్చి చెండాడే మన్న తృప్తితో వాహనాలు వచ్చిన దారినే పరిగెత్తాయి.

ఫోనుల మీద వర్తమానాలు ప్రవహించాయి. ఆలస్యంగా వచ్చిన ప్రమాదనివారక సిబ్బంది నీరు దొరికే అవకాశం లేక నిట్టూర్చి, మామూలు వసూలు చేసుకునే మార్గం తెలీక నిరాశ పడిపోయారు.

తీరిగ్గా వచ్చిన రక్షక భటులు దూరం నించి పరిస్థితి గమనించి-"ప్రస్తుతం మనం ఏం చేయగలమయ్యా!?" అని తర్కించుకుంటున్నారు.

ఒక చిన్ని మురికి గుంటలో నిపుణుల చేతికి చిక్కకుండా బతికి, బట్ట ల్లేకుండానైనా శ్రావ్యంగా పాడగల రెండు కప్ప పిల్లలు కనులారా ఈ దృశ్యం చూసి బెక బెక లాడుతున్నాయి.

"వారసం కోసం బోదురు కప్పని నెత్తి కెత్తుకున్నారు. పసుపు కుంకాలెట్టారు. ఆ తరువాత సంపడం మొద లెట్టారు-ఏం టిదంతా??"

"ఒరే సన్నాసీ-అల్లు సంపగలరు-నరుక్కోగలరు- ఎనకబడినోల్లు- ఎందుకూ పనికి రానోల్లు- ముందు న్నోల్లు- ముదనష్టపోల్లు-ఇలా రకరకాలుగా గిరి గీసుకుని నరుక్కుంటారు-"

"అసలు వర్గాలంటే ఏంటోయ్?"

"రకరకాల పేర్లెట్టుగోడం-బోదురు కప్పలనీ, రాతి కప్పలనీ, సీమ కప్పలనీ-ఆ మనిసి మన క్కూడా వర్గాలు పెట్టాడు."

"తెగ నరుక్కోవడానికి తేడాలు పెట్టుకోడం మనిసికి పుట్టుకతో వచ్చిన బు ద్దన్నమాట-"

మేఘం ముక్క కూడా లేని ఆకాశం కప్పల బెకబెకల్ని వింది. మనిషిమీద వాటి వ్యాఖ్యానాలనూ వింది.

ఆ మరునాడు-

పత్రికలు వర్గకలహాల గురించి, కులమత విభేదాల వల్ల చేకూరే నష్టాల గురించి సంపాదకీయాలు, వార్తలు ప్రచురించాయి. పరిస్థితి అదుపు తప్పడానికి కారణం పాలక పక్షం అసమర్థత అని ప్రతి పక్షాలు విమర్శించాయి. ఇంతకూ అసలు బాధ్యత ప్రతి పక్షాలదేనని పాలక పక్షం తప్పు పట్టింది.

సంప్రదాయవాదులుగా పేరు పడి, చావు దెబ్బలు తిన్న వారు తమపై జరిగిన దౌర్జన్యానికి ప్రతీకారం తీర్చుకునే మార్గాల అన్వేషణలో పడ్డారు.

పరాయి వర్గమని దెబ్బ తీయడానికి ముందంజ వేసిన వారు విజయోత్సవం జరుపుకోవడంలో నిమగ్నమయ్యారు. బాణసంచా కాల్చి, బాటిల్స్ విప్పారు.

ఇంతా చూసీ ఆకాశం కన్నీరు కూడా పెట్ట లేదు.

